క్లుప్తంగా

ఈలపాట రఘురామయ్యకు ఘన నివాళి



సుద్దపల్లి(చేబ్రోలు): ఈలపాట ద్వారా ప్రజల మన్ననలు పొందిన రఘురామయ్య అందరికీ ఆదర్శనీయులని పద్మశ్రీ ఈలపాట రఘురామయ్య కమిటీ అధ్యక్షుడు కల్యాణం సత్యనారాయణ అన్నారు. చేబ్రోలు మండలం సుద్దపల్లిలో ఆదివారం రఘురామయ్య 50వ వర్ధంతి సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణ మండపం సమీపంలోని ఆయన విగ్రహానికి గ్రామస్తులు, పెద్దలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రామానికి చెందిన కల్యాణం రఘురామయ్య ఈలపాటనే ఇంటిపేరుగా చేసుకున్న గొప్ప కళాకారుడు, వెండితర నటుడుగా ఖ్యాతి గాంచారని నేతలు తెలిపారు. అప్పటి ప్రధాన మంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ తదితరుల వద్ద ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసలు పొందారని గుర్తు చేశారు. రవీంద్రనాథ్ ఠాగూర్‌తో ఆంధ్రా నైటింగేల్ బిరుదును పొందారని తెలిపారు. కార్యక్రమంలో కల్యాణం నరసింహారావు, గోవాడ మోహనరావు, కట్టా భానుమూర్తి, కల్యాణం పుల్లారావు, శ్రీనివాసరావు, అంజయ్య పాల్గొన్నారు.

మాంసం విక్రయదారులకు నోటీసులు




నెహ్రూనగర్: నగరంలో పరిశుభ్ర వాతావరణంలోనే మాంస విక్రయాలు చేపట్టాలని ఎంహెచ్ఓ మధుసూదన్ వ్యాపారులకు చెప్పారు. ఈ మేరకు వ్యాపారులకు నోటీసులు జారీ చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించిన నేపథ్యంలో ప్రజారోగ్య అధికారులను ఆదివారం నగరంలోని 256 స్టాల్స్‌కి అందజేశారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఓ మాట్లాడుతూ చికెన్, మటన్ తదితర మాంస విక్రయదారులు తప్పనిసరిగా స్టాల్స్, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. నిషేధిత క్యారీ బ్యాగ్‌లు వినియోగించవద్దని, వ్యర్థాల సేకరణ చేసే ఏజెన్సీకి మాత్రమే వాటిని ఇవ్వాలని చెప్పారు. మాంస వ్యర్థాల్ని కాల్వలు, రోడ్ల మీద వేస్తే వెంటనే ట్రేడ్‌లైసెన్స్ రద్దుతో పాటు భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామని స్పష్టం చేశారు. మాంస వ్యాపారులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. స్టాల్స్ శుభ్రంగా లేకపోతే ప్రజలు కూడా మాంసాన్ని కొనుగోలు చేయవద్దని, లేనిపక్షంలో ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని సూచించారు.

పేదలకు బియ్యం, పింఛన్ల పంపిణీ



గుంటూరు మెడికల్: వాసవీ క్లబ్, వాసవీ మహిళా క్లబ్, వాసవీ యువ క్లబ్ గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆర్. అగ్రహారం గీతా మందిరంలో 102 మంది పేదలకు బియ్యం, పింఛన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న క్లబ్ జోన్ చైర్మన్ మున్నలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ 23 సంవత్సరాల కిందట క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాయవరపు అశోక్‌కుమార్ బియ్యం, పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. అతి నేటికీ యథావిధిగా కొనసాగడం అభినందనీయమని తెలిపారు. కొల్లిపర దుర్గా నాగమణి, దాతల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కొంజేటి వెంకట నగేష్, సెక్రటరీ పి. ఆంజనేయులు, కోశాధికారి గ్రంధి శ్రీనివాస్‌గుప్తా, వెంకట అనురాధ, కొంజేటి సుదీప్, గుండా హరిప్రసాద్, అచ్యుత నిరంజన్, సునీల్, కొప్పురావూరి లక్ష్మీనారాయణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.

డ్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహించాలి



నెహ్రూనగర్: డ్వాక్రా మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ప్రోత్సహించి వారికి ఆర్థిక చేయూత అందించాలని రాష్ట్ర చేనేత ఉత్పత్తుల కమిటీ సభ్యురాలు, డ్వాక్రా బజార్ నిర్వాహకురాలు కోట దేవకీదేవి కోరారు. బృందావన్ గార్డెన్స్‌లోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌లో ఆదివారం ఆమె మాట్లాడారు. డ్వాక్రా బజారు మార్చి 21వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. స్టాల్స్‌లో డ్వాక్రా మహిళలు తయారుచేసిన నాణ్యమైన ఉత్పత్తులతో పాటు గద్వాల్, మదనపల్లి, వెంకటగిరి, పట్టుచీరలు కూడా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

జగన్ గెలుపు.. పేదల జీవితాల్లో మలుపు



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులతో ఎమ్మెల్సీ, విప్ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి
- కష్టపడి పనిచేసే వారికి పార్టీలో తప్పక గుర్తింపు: సమన్వయకర్త బలసాని
- పేదల పక్షపాతి జగన్: జిల్లా అధ్యక్షుడు డొక్కా
- కాపులను అవమానపరచడం బాబు నైజం: మేయర్ కావటి
- ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆళ్ల రవి దేవరాజు బాధ్యతలు
- అభినందించిన ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు

గుంటూరు రూరల్: సమాజంలో అసమానతలు తొలగించేందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాల ద్వారా రెండుగులు ముందుకు వేస్తే అంతరాలు లేని అభివృద్ధికరమైన సంక్షేమ సమాజ ఆవిష్కరణ కోసం ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాలుగడుగులు ముందుకేసి పేదల జీవితాల్లో సమూల మార్పులు తెచ్చేందుకు శ్రీకారం చుట్టినట్లు ప్రభుత్వ విప్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి వెల్లడించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో జగన్ గెలుపు.. పేదల జీవితాల్లో మలుపుగా ఆయన అభివర్ణించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మంచిని కోరుకునే ప్రతి ఒక్కరూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే విధంగా జగన్‌ను, ప్రత్తిపాడు నియోజకవర్గంలో బలసాని కిరణ్‌ను ఆశీర్వదించాలని అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా ఆళ్ల రవి దేవరాజు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఏటుకూరు బైపాస్ అనంతవరప్పాడు రోడ్డులో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి అధ్యక్షతన జరిగిన అభినందన సభలో పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొని రవిదేవరాజుకు, నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి జెండా భుజాన పెట్టుకుని జగన్ ముఖ్యమంత్రి కావాలన్న ఏకైక లక్ష్యంతో పనిచేసిన నిస్వార్థ రాజకీయనేతగా ఆళ్ల రవిరాజును అభినందించారు.

■ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందనేందుకు రవిదేవరాజు నియామకమే చక్కటి నిదర్శనమని చెప్పారు.

■ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యంగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నట్లు చెప్పారు. అంబేద్కర్ ఎలా అయితే బడుగు, బలహీనుల సంక్షేమం కోసం తపించేవారో సరిగ్గా ఆయన కూడా నిరంతరం అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆళ్ల రవి దేవరాజును నియమించినట్లు తెలిపారు.

■ నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కాపులకు మేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్ అని కొనియాడారు. దీనికి పూర్తి భిన్నంగా చంద్రబాబు తన జీవిత కాలమంతా కాపుల అణిచివేతపైనే ప్రధానంగా దృష్టి సారించినట్లు ధ్వజమెత్తారు. 24 సీట్లు ఇవ్వడం ద్వారా కాపులను మరోసారి చంద్రబాబు అవహేళన చేశారని ఆరోపించారు. ఈ పరిణామాన్ని, చంద్రబాబు నైజాన్ని కాపులు నిశితంగా గమనించి మేలు చేస్తున్న జగన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాలని ఆయన సూచించారు.

■ ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆళ్ల రవిదేవరాజు మాట్లాడుతూ తనకు పదవి లభించేందుకు ప్రధానంగా కృషి చేసిన ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, ప్రత్తిపాడు పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

■ సభలో నూతన కమిటీ సభ్యులు జొన్నలగడ్డ బుజ్జి, చేపర్తి లక్ష్మణ,బొల్లెద్దుల వెంకటేశ్వర్లు, ముద్రబోయిన మీన, నూర్‌బాషానాగుర్‌బీ, ముప్వ భద్రయ్యచౌదరి, గుమ్మడి వెంకటేశ్వర్లు, కొమ్మగిరి శ్రీబాజీ, గల్ల దివ్య, సింగారెడ్డి జ్యోతి, కందుకూరి జ్యోతి, దుగ్గెంపూడి కిషోర్‌రెడ్డి, అచంట బాబూరావు, కుందురి రామిరెడ్డి, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గుంటూరు రూరల్ మండల ఎంపీపీ ఇంటూరి పద్మావతి, జెడ్పీటీసీ సభ్యులు తుమ్మల సుబ్బారావు, వెంకటలక్ష్మి, వట్టిచెరుకూరు ఎంపీపీ చిలకా రాజ్యం సుబ్బారావు, మిర్చి యార్డ్ డైరెక్టర్ ఇంద్ర, కార్పొరేటర్లు చల్లా రాజ్యలక్ష్మి, ఏరువ సాంబిరెడ్డి, చల్లావారిపాలెం సర్పంచ్ ఆరుదల సాంబశివరావు, వట్టిచెరుకూరు మండల కన్వీనర్ వీరనారాయణ, గుంటూరు క్లస్టర్ అధ్యక్షులు నూనె ఉమామహేశ్వరరెడ్డి, బండారు శ్రీనివాసరావు, విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య పాల్గొన్నారు.

వైభవంగా వీరమ్మ పేరంటాళ్ల తిరునాళ్ల

భక్తిశ్రద్ధలతో సిడిమాను మొక్కులు చెల్లించుకున్న భక్తులు



పెదకాకాని: పెదకాకాని ప్రధాన సెంటర్‌లోని శ్రీ ఉయ్యూరు వీరమ్మ పేరంటాళ్ల తిరునాళ్లను పురస్కరించుకుని ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. ఐదు రోజులుగా తిరునాళ్లలో భాగంగా ట్రాక్టర్‌పై అమ్మవారిని కొలువుదీర్చి కొమ్ముల వాయిద్యాలు, కనక తప్పెట్లు నడుమ తక్కెళ్ళపాడు, వెనిగండ్ల, పెదకాకాని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. బహుళ పాఢ్యమి ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ పాతూరు ఏరియాలో గ్రామోత్సవం జరిగింది. రాత్రి 10 గంటల తరువాత ముదరపోలు పోయుట, గ్రామసిడి, సింకా వారి బోనం, భక్తుల సిడిమాను మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సిడిమాను మొక్కులు చెల్లించుకునేందుకు ఉత్సవంగా తరలివచ్చారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ కాంతులతో వెలిగిపోయింది. రంగుల రాట్నాలు, బొమ్మల బండ్లు, తినుబండారాలు, చెరుకుల వ్యాపారులతో సందడిగా మారింది. యువతీయువకులు ఆలయం చుట్టూ తిరుగుతూ సందడి చేశారు. ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి ఎం. కోటేశ్వరరావు పర్యవేక్షించారు. పెదకాకాని పోలీసులు, సిబ్బంది బందోబస్తు పర్యవేక్షించారు.

సమష్టి కృషితో జగనన్నను మరోసారి సీఎం చేద్దాం

ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా పనిచేద్దామని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఏటుకూరులోని నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ప్రత్తిపాడు మండలం ఆత్మీయ సమావేశాన్ని మండల మాజీ అధ్యక్షుడు గట్టు విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమన్వయకర్త మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేశారన్నారు. తల్లి కడుపులోని బిడ్డనుంచి ఆశీర్వదించే అవ్వాతాతల వరకూ ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాల్ని అందించారని తెలిపారు. చంద్రబాబు అతని తొత్తు పార్టీలు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజల్ని దోచుకున్నారని గుర్తు చేశారు. జగనన్న పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజల్ని మోసం చేసేందుకు చంద్రబాబు అతని తొత్తు పార్టీలన్నీ కలిసి ప్రజలకు కల్లబొల్లి హామీలు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలు చంద్రబాబును నమ్మే పరిస్థితిలో లేరని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బూత్ కమిటీల నుంచి కార్యకర్తల వరకూ ప్రతి ఒక్కరూ జగనన్న చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేయాలని తెలిపారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు మన జగనన్న అని వివరించారు. మాట ఇచ్చారంటే చేసి తీరుతారని, ప్రతి కార్యకర్తకు ఆయన అండగా ఉంటారని గుర్తు చేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త జగనన్నకు అండగా నిలిచి ప్రభుత్వాన్ని నిలబెట్టుకునేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని జగనన్నకు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని కార్యకర్తలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జగనన్న ద్వారానే సాధ్యమని నమ్మి ఎందరో ప్రజలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం రూరల్ మండలంలోని లింగాయపాలెం గ్రామానికి చెందిన జనసేన, టీడీపీ కార్యకర్తలు 100 కుటుంబాలు, సుమారు 400 మంది కార్యకర్తలు స్థానిక నాయకుడు చంటి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఏటుకూరులోని నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త కిరణ్ కుమార్ పార్టీ కండువాను కప్పి సాదరంగా స్వాగతం పలికారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



పొన్నూరు: మండలంలోని వెల్లలూరు గ్రామ పంటకాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు రూరల్ ఎస్ఐ భార్గవ్ తెలిపారు. 35 ఏళ్ల వయస్సున్న వ్యక్తి మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, తాగిన మైకంలో కాలువలో పడి మరణించి ఉండొచ్చని చెప్పారు. వివరాలకు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నల్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం .. గుంటూరు వసంతరాయపురం కాలనీకి చెందిన పునుగుపాటి రామ్మోహనరావు(65) ఎన్‌హెచ్–16 ఏటుకూరు సర్వీసు రోడ్డును దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో తీవ్రగాయాలయిన ఆయన అక్కడిక్కడే మృతి చెందారు. సంఘటన విషయం తెలుసుకున్న నల్లపాడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డు అన్నదాన సమాజం ఆడిటోరియంలో నవకళోదయ ఆర్ట్స్ ఆర్గనైజర్ పి.ఎల్.ఎస్.మూర్తి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఘంటసాల సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. సెయింట్ లారెల్స్ స్కూల్ డైరెక్టర్ మేకల రవీంద్రబాబు, బిల్లా అశోక్, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఘంటసాల ఆలపించిన పలు పాత సినిమా పాటలను గాయకులు టి. సుధీర్, స్టాలిన్ బాబు, నారాయణ, మోహన్, గాయత్రి, విజయలక్ష్మి శ్రావ్యంగా పాడి శ్రోతల్ని మైమరపింప చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ధూళిపాళ్లను ప్రజలు ఛీకొట్టి ఐదేళ్లు పూర్తి

- కోట్లు ఖర్చుపెట్టి టికెట్ తెచ్చుకున్నా ఓటమి ఖాయం
- కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోశయ్య

పొన్నూరు: నియోజకవర్గ ప్రజలు టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్రను ఛీకొట్టి ఐదేళ్లు పూర్తయిందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య విమర్శించారు. పాతికేళ్ల టీడీపీ పాలన, పెత్తందారీ వ్యవస్థకు ప్రజలు 2019లోనే చరమ గీతం పాడారన్నారు. చంద్రబాబుకు కోట్ల రూపాయలు ఇచ్చి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకున్న నరేంద్రను ప్రజల అంగీకరించేందుకు సిద్ధంగా లేరని ధ్వజమెత్తారు. ఆదివారం నిడుబ్రోలులోని దివంగత మాజీ ఎమ్మెల్యే చిట్టినేని వెంకటరావు నివాసం వద్ద వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే రోశయ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 25 ఏళ్లలో ఏ అభివృద్ధి చేయని, ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన నరేంద్ర ఎమ్మెల్యేగా అనర్హుడని పేర్కొన్నారు. టీడీపీ పాలనలో అక్రమ సంపాదనతో నరేంద్ర ఆస్తులు పెరిగాయి గాని, ప్రజలకు మంచి జరిగిందేమీ లేదని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన ఐదేళ్లలో నిడుబ్రోలులో కోటి రూపాయలతో చిట్టినేని వెంకట్రావు స్మారక పార్కు, 23వ వార్డులో పార్కు, గ్రంథాలయం, రూ. 35 లక్షలతో బస్సు డిపో అభివృద్ధి, రూ. 10 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు, రూ.42 కోట్లతో చేబ్రోలు కొమ్మమూరు కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణం, సిమెంటు రోడ్లు, మురుగు కాలువలు, నిర్మాణాలు తదితర అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలన చూసి తిరిగి అధికారం కట్టబెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో 175కు 175 సీట్లు గెలవడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి చరిత్ర సృష్టించబోతున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తాను 25 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే చిట్టినేని వెంకట్రావు చిత్రపటానికి ఎమ్మెల్యే రోశయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బొద్దులూరి రంగారావు, జెట్టి శరత్ బాబు, యాసంగి శంకర్, సాంబశివరావు, మూకిరి అనిల, గంగాధర్, ఆకుల వెంకటేశ్వరరావు, దాసరి నారాయణరావు, షేక్ సైపుల్లా, షేక్ మాము, ఎంపీ మొహమ్మద్, రుద్రపాటి ఆదిశేషు, కొఠారి వెంకటరమణ, శ్రీధర్, మూర్తి రాజు, రాయపాటి మురళి, యాసంగి శంకర్, మండ్రు అనిత, కోట శ్రీనివాసరావు, జంగమయ్య, కొల్లేరు శ్రీనివాసరావు, బాబు, రమేష్, గోపి పాల్గొన్నారు.

48 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

చేబ్రోలు: స్థానిక యడ్లపాటినగర్‌కు చెందిన 48 కుటుంబాల వారు ఆదివారం లింగాబత్తుని కోటేశ్వరమ్మ, బండ్లమూడి ధనరాజ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పార్టీ కండువా కప్పి వారిని ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై, శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య చొరవతో వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, పరిమి సత్యం, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత



జోసఫ్‌నగర్‌లో అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: 25వ డివిజన్ పరిధిలోని జోసఫ్‌నగర్, కృష్ణబాబుకాలనీ ప్రాంతాల్లో ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం–2 ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక సేవా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.ధాత్రికుమారి ఆధ్వర్యంలో విద్యార్థినులు నీటి సంరక్షణ, శుద్ధ జలంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. నీటి ద్వారా సంక్రమించే అతిసార వ్యాధి వంటి జబ్బులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. వర్షపు నీటిని ఇంకుడు గుంతలద్వారా నిల్వ చేసే పద్ధతుల గురించి ధాత్రికుమారి వివరించారు. భూగర్భ నీటి వనరుల మట్టాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో విద్యార్థినులు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కామర్స్ అధ్యాపకురాలు శ్రీలత పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ గణేషుని రాజేష్

గుంటూరు మెడికల్: సుదర్శిని ఐ అండ్ విజన్ అసోసియేషన్, సుదర్శిని కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో యాదవ హైస్కూల్ పూర్వ అధ్యాపకుల అసోసియేషన్ సహకారంతో ఆదివారం స్థానిక పాత గుంటూరు యాదవ హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుదర్శిని కంటి హాస్పిటల్ అధినేత డాక్టర్ గణేషుని రాజేష్ వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. సుమారు 30 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. అత్యాధునిక కంటి వైద్య పరికరాలు ఉన్న 'విజన్ ఆన్ వీల్స్' సంచార కంటి ఆసుపత్రిని వైద్య శిబిరానికి తీసుకొచ్చి పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పేదలకు కంటి సమస్యల గురించి అవగాహన కల్పించి ఖరీదైన వైద్యాన్ని సైతం ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. శిబిరంలో డాక్టర్ అదితి, మేనేజర్ వెంకట్రావు పాల్గొన్నారు.

వీనుల విందుగా హరికథా గానం



హరికథా గానం చేస్తున్న జయంతి సావిత్రి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శ్రీ మదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 159వ జయంతి, 79వ వర్ధంతి పురస్కరించుకొని నారాయణదాసు కథాగాన కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణం హరికథా గానం వీనులవిందుగా సాగింది. ఆలయ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ హరికథా భాగవతారిణి జయంతి సావిత్రి శ్రీ సీతారాముల కల్యాణ విశేషాలను చక్కగా గానం చేశారు. వయోలిన్‌పై రవిబాబు, మృదంగంపై ఎం.నగధరరావు వాయిద్య సహకారం అందించారు. కార్యక్రమాన్ని ఉపాధ్యాయుల రాజరాజేశ్వరి పర్యవేక్షించారు.

భావి కవితా చక్రవర్తి దేవులపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న జయకుమార్

లక్ష్మీపురం: భావి కవితా చక్రవర్తి దేవులపల్లి కృష్ణశాస్త్రికి తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానముందని సినీ దర్శకుడు, కవి కె.జయకుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం దేవులపల్లి కృష్ణశాస్త్రి వర్ధంతి సందర్భంగా సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయకుమార్ మధుర, మంజుల, మనోహర దేవులపల్లి కవితలను రుచి చూడని తెలుగు వారుండరంటే అతిశయోక్తి లేదన్నారు. ఎన్నో చలన చిత్రాలకు అపురూపమైన పాటలను అందించారని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, గాయకుడు, భరత్‌రెడ్డి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం, మానసిక వికాసం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పెదనందిపాడు(కాకుమాను): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు తెలిపారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం అంటే మా కిష్టం' కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ పుస్తక పఠనం వలన మానసిక వికాసం, విషయ పరిజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు.పాఠ్య పుస్తకాలతో పాటు ప్రతి రోజు ఒక గంట సమయాన్ని గ్రంథాలయానికి కేటాయించి ఇష్టమైన పుస్తకాలను చదువుకోవాలని ఆయన సూచించారు.విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు గ్రంథాలయాలు ఎంత గానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆయన పుస్తక పఠనం చేశారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారిణి సుభాషిణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ పారాయణ



పాత గుంటూరు: సంపత్‌నగర్‌లోని శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానం 58వ వార్షికోత్సవాన్ని గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీ హరిప్రసాదరావు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం శృంగేరికి చెందిన పది మంది వేద పండితులు చండీ పారాయణం చేశారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ప్రత్తిపాడు డివిజన్
90109 57733 (ప్రత్తిపాడు)
90109 62225 (పొన్నూరు)
Office mail : sakshigntadvt@gmail.com